క్లుప్తంగా

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడిగా వలరాజు



ఖమ్మంరూరల్: ఖమ్మం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడిగా తెల్దారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది మల్లెబోయిన వలరాజు నియమితులయ్యారు. ఖమ్మం కోర్టులో నూతనంగా ప్రారంభించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంకు ముగ్గురు న్యాయవాదులను నియమించగా అందులో వలరాజు ఒకరు. ఈమేరకు లీగల్ సెల్ అథారిటీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా ఎంపికైన వలరాజును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, తమ్మినేని వెంకట్రావు, సర్పంచ్ ఎస్.కోటయ్య అభినందించారు.

నేత్రదానం

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రగళ్లపల్లి జానకిదేవి, కోనుగంటి సుబ్బారావు, వెన్ను ఉపేంద్రమ్మ, మామిడోజు వీరాబాయి, పోరెడ్డి రామనర్సమ్మ, అడసా భాగ్యమ్మ, కాపనబోయిన రంగనాయకులు, గుమ్మడివెల్లి పుష్పావతి మృతి చెందగా వారి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సేకరించిన నేత్రాలను హైదారబాద్ ఎల్.వి ప్రసాద్, అపోలో, వాసన్, అగర్వాల్ ఐబ్యాంక్‌లకు పంపినట్లు ఖమ్మం నేత్ర నిధి కార్యదర్శి ఆర్.అనంత పద్మనాభం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

28న పెన్షనర్ల నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ జేఏసీ ఆదివారం తెలిపింది. తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల జేఏసీ నాయకులు పరిశ పుల్లయ్య తెలిపారు. జూలై 12న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్సను అందించాలని, ప్రతీ జిల్లా కేంద్రంలో కనీసం రెండు వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు మొదలైన పది డిమాండ్లపై ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిరుపేదలకు సాయం



సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో 'డాన్ టూ డస్క్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలకు ఆర్థిక సాయం అందించారు. నిత్యావసర సరుకులు, వస్త్రాలు, రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు రుద్రంగి రవి, పల్లపోతు శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ దోసపాటి శేఖర్, షరాబు సాయిపవన్, కొత్తా కరుణ, జయశ్రీ, కృష్ణారావు, అశోక్, కొత్తా సోమశేఖర్, దోసపాటి ఉషారాణి సోమశేఖర్ గుప్తా, వెంకటేశ్వరరావు, స్వాతి, నాగసాయి పాల్గొన్నారు.

వీపీ సింగ్‌కు నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మాజీ ప్రధాని వీపీసింగ్ జయంతి సందర్భంగా ఆదివారం సంఘం చైర్మన్ డాక్టర్ కేవీ.కృష్ణారావు, వీపీసింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంతేటి వీరభద్రం, ముల్కా సురేష్ మాట్లాడగా కో కన్వీనర్ వెంకటరమణ, మస్తాన్, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, నరసింహారావు, శరత్‌నాయక్, తరుణ్‌నాయక్, హరీష్, అంజి, ఏ.పీటర్, నరసింహరావుస్వామి, బాబు, రవి పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	66	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	90		10
కాకర	56	చుక్కకూర	2
బీర	40		10
దొండ	26	తోటకూర	2
సొరకాయ	20		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	86		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

చెత్తతోనే సహవాసం..!

పెదతండాలో డంపింగ్‌యార్డు నిర్మాణం ఎప్పుడో?

- ఎప్పటికప్పుడు తరలించక గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- ప్రజల గోడు పట్టించుకోని అధికారులు

ఖమ్మంరూరల్: మేజర్ పంచాయతీ అయిన పెదతండాలో డంపింగ్‌యార్డు లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతోంది. ప్రజలు డంపింగ్‌యార్డు నిర్మాణం ఎప్పుడో అని ఎదురుచూస్తున్నారు. నగరానికి ఆనుకుని ఉండటంతో యార్డు నిర్మాణానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో నిర్మాణం చేపట్టలేదు. చెత్తనంతా ఏరోజుకారోజు తరలించకపోవడంతో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సేకరించిన చెత్తను అయిదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న తెల్దారుపల్లి, పల్లెగూడెం యార్డులకు తరలిస్తున్నారు. మేజర్ పంచాయతీ కావడంతో ప్రతీ రోజు చెత్త ఎక్కువగా వస్తుంటుంది. స్థలం కోసం సర్వే చేసిన అధికారులు పోలేపల్లి పరిధిలోని కేంద్రీయ విద్యాలయం సమీపంలో ఎకరం స్థలాన్ని గుర్తించారు. కానీ యార్డు నిర్మాణం మాత్రం ఇంత వరకు జరగకపోవడంతో దూరంగా ఉన్న వేరే పంచాయతీల డంపింగ్ యార్డులకు చెత్తను తరలించాల్సి వస్తోంది. దీంతో చెత్త తరలింపులో నెలల తరబడి ఆలస్యం కావడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే..

వర్షాకాలం సీజన్ మొదలైంది. ఈ సమయంలో చెత్తను వెంటనే తరలించాల్సి ఉండగా చెత్తను తొలగించకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఇటు వైపు కన్నెత్తి కూడా చూడటంలేదని గ్రామస్తులు



జలగంనగర్ శివారు ఇళ్ల సమీపంలో నిల్వ ఉన్న చెత్త

ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెదతండా పంచాయతీ పరిధిలోని పెదతండాతో పాటు, నాయుడుపేట, జలగంనగర్‌లలో ఏ వీధి చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో పంచాయతీ పాలకవర్గం ఉన్నప్పుడు సంబంధిత సర్పంచ్ బాధ్యత తీసుకొని చెత్తను తొలగించేవారని, ఇప్పుడు ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతుండటంతో ఆయన ఎప్పుడు వస్తారో ఎక్కడ ఉంటారో ప్రజలకే కాదు కిందిస్థాయి సిబ్బందికే తెలియదు. దీంతో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు మురుగునీరు, చెత్తాచెదారంతోనే నెలల తరబడి సహవాసం చేస్తున్నారు.

నిధులు ఏమవుతున్నాయి.. ?

ఇదిలా ఉండగా పెదతండాకు నెలకు కనీసం రూ.50 లక్షల నుంచి 80 లక్షల వరకు వసూలు అవుతాయి. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ కూడా తోడవుతుంది. అయినా ఈ నిధులు ఎటు పోతున్నాయి, ఏపనికి ఖర్చు చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. కోట్ల నిధులు ఉన్నా కనీసం డ్రెయినేజీల్లో ఉన్న చెత్తను తొలగించేందుకు అధికారులు ముం



డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త

దుకు రావడంలేదు. పంచాయతీలో ఉన్న నిధులను చూస్తే అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది. ప్రధానంగా పేరుకుపోయిన చెత్తను తొలగించే విషయంలో అధికారుల అలసత్వం ప్రదర్శించడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్తతీయక రెండు నెలలు



పెదతండా బొడ్రాయి వీధిలో రెండు నెలల నుంచి వీధుల్లోని డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఇంతవరకు చెత్త తీయలేదు. నిత్యం దుర్గంధంతో కాలం వెళ్లదీస్తున్నాం. ఈ విషయమై ఎవరికి చెప్పినా ఏమీ పట్టించుకోవడంలేదు. వెంటనే చెత్తను తొలగించి దుర్వాసన నుండి కాపాడాలి.

– బోయిన సుభద్ర, పెదతండా

సీజనల్ వ్యాధులతో భయమేస్తోంది



అసలే వర్షాకాలం మొదలైంది. ఇప్పటికే చెత్త గుట్టల కొద్దీ పేరుకుపోయింది. రెండేళ్ల నుంచి వచ్చే జ్వరాలు, అంటువ్యాధుల గురించి తలచుకుంటేనే భయమేస్తోంది. చెత్తను తొలగించాలని అధికారులను అడిగితే తీసేస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా చెత్త అక్కడే ఉంటోంది. చెత్తను తీసి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి.

– బానోత్ రవి, పెదతండా

చెత్త తొలగించడం ఆలస్యమైంది

ఎప్పటికప్పుడు వీధుల్లో, కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగిస్తున్నాం. ఈ మధ్యకాలంలో కాస్త ఆలస్యమైంది. డంపింగ్ యార్డు ఎక్కడ ఉన్నా అది పెద్ద సమస్య కాదు. అందుబాటులో ఉన్న సిబ్బందితో చెత్తను వాహనాల ద్వారా తరలిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాం.

– రామకృష్ణ, కార్యదర్శి

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ

తిరుమలాయపాలెం: దేశంలో బీజేపీ కొనసాగిస్తున్న మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బుగ్గవీటి సరళ అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో మాట్లాడారు. దేశంలో మత విద్వేషాలతో గద్దెనెక్కేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు బండి రమేష్, పిట్టల రవి శిక్షణ తరగతులలో పలు అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, మండల ఇన్‌చార్జ్ షేక్ బషీరుద్దీన్ మండల కార్యదర్శి శ్రీను, నర్సయ్య, బింగి రమేష్, తుల్లూరి నాగేశ్వరరావు, సురేష్, రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనపై ప్రచారం

కూసుమంచి: ప్రదాన మంత్రి నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనను ప్రజలకు వివరించేందుకు బీజేపీ చేపట్టిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆదివారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో నిర్వహించారు దీనిలో భాగంగా పార్టీ జిల్లా కార్యదర్శి నరికంటి వీరభద్రం, ఓబీసీ రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి ప్రధాని మోదీ పాలనలో పొందిన లబ్ధిని కరపత్రాల ద్వారా వివరించారు. మోదీ పాలనకు మద్దతుతెలిపి మళ్లీ ప్రధానిగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దామల్ల ప్రభాకర్, ఓబీసీ మండలాధ్యక్షులు సోమనపల్లి వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: తన ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఖమ్మం ఖానాపురం హవేలీకి చెందిన లారీ డ్రైవర్ వడ్లముడి నరేంద్రబాబు అధికారులను కోరాడు. ఆదివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా తన భార్య పిల్లలతో నివసిస్తున్న తమ ఇంటిని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తప్పుడు ధ్రువపత్రాలతో వచ్చి దౌర్జన్యంగా కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశాడు. తనవద్ద ఉన్న ధృవపత్రాలను పరిశీలించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

మండలి అభిషేక మహోత్సవం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లోని శ్రీభక్త ఆంజనేయస్వామి ప్రతిష్ఠ చేసుకున్న జలాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట పురస్కరించుకొని ఆదివారానికి 41వ రోజు సందర్భంగా మండల అభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దంపతులు చావా మాధురి నారాయణరావు ఆధ్వర్యంలో హోమం పూజలు, అభిషేకం పూజలు చేశారు. హాజరైన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

వీధికుక్కలపై అప్రమత్తంగా ఉండాలి

నేలకొండపల్లి: వీధి కుక్కలపై ప్రజలు అప్రమతంగా ఉండాలని ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. మండలంలోని రాజేశ్వరపురంలో కుక్కల స్వైర విహారం చేసి పది మందిని గాయపరచటంతో ఆదివారం గ్రామాన్ని వైద్య బృందంతో కలిసి సందర్శించారు. బాధితులను కలిసి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యశాఖ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో బోదులబండ వైద్యాధికారి కె.రాధాకృష్ణ, సర్పంచ్ దండా పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, గ్రామ పెద్దలు షేక్ సొందుమియా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి సన్మానం



ఈశ్వరలింగంను సత్కరిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఎమర్జెన్సీ రోజు సందర్భంగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన నగరానికి చెందిన సుగ్గల ఈశ్వరలింగంను ఆదివారం బీజేపీ నేతలు ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఎర్నేని రామారావు మాట్లాడుతూ... ఎమర్జెన్సీ సమయంలో జిల్లా నుంచి 19 మందిని అరెస్టు చేశారన్నారు. ప్రస్తుతం ఈశ్వరలింగంను సన్మానించుకోవటం శుభపరిణామమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, నున్నా రవికుమార్, శ్యామ్‌రాథోడ్, మందా సరస్వతి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఉపేందర్‌గౌడ్, మృత్యుంజయ, డీకొండ శ్యామ్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తగా ఎంపికైన నరేష్‌కు..



నరేష్‌ను సన్మానిస్తున్న నాగభూషణం

ఖమ్మంఅర్బన్: డీఆర్డీఓ శాస్త్రవేత్తగా ఎంపికైన చెన్ను నరేష్‌ను నగరంలోని మధురానగర్‌లో యాదవ సంఘం భవనంలో డీసీసీబీ చైర్మన్ ఆదివారం సన్మానించారు. పేదకుటుంబంలో జన్మించిన నరేష్ శాస్త్ర వేత్తగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, యాదవసంఘం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరులో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ఆదివారం సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ ప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు, సత్యసాయి సేవా సమితి సహకారంతో ప్రధాన సెంటర్‌లో బస్సు షెల్టర్‌ను నూతనంగా నిర్మించారు. ఈ కార్యక్రమంలో వెన్నపూసల సీతారాములు, పాగర్తి సుధాకర్, కొత్తా రమేష్, ఆంజనేయులు, వెంకటరామారావు, వి.కృష్ణ, రావెళ్ల వెంకటేశ్వరరావు, ఆర్.లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి అభిషేకాలు, హోమాలు



అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా ఖమ్మం నగరంలోని గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో ఆదివారం సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అన్నాభిషేకం చేశారు. మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నగరంలోని త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణ సాయి ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా అరుణహోమం నిర్వహించారు. ఆశ్రమం నిర్వహణ, నిర్మాణ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు, కమిటీ ప్రతినిధులు సిద్దంశెట్టి నాగమణి, మార్తా నరసింహారావు, బిజినేపల్లి సుదర్శన్ గుప్తా, కన్నం రమణ, సిద్దంశెట్టి శ్రీకాంత్, దూపగుంట్ల స్వరాజ్యలక్ష్మీ, మైలవరపు కృష్ణకుమారి, కలకోట కృష్ణారావు, ఓరుగంటి మురళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

సమాజాన్ని అధ్యయనం చేయాలి



మాట్లాడుతున్న రవిబాబు

ఖమ్మం సహకారనగర్: రాజనీతి శాస్త్ర అధ్యాపకులు నిరంతరం సమాజాన్ని అధ్యయనం చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి కె.రవిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల నూతన రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనానికి డీఐఈఓ రవిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజనీతి శాస్త్రం పోటీ పరీక్షల్లో చాలా కీలకమైదన్నారు. తమ విద్యార్థులు నిరంతరం పోటీ పరీక్షల్లో ముందు ఉండేలా అధ్యాపకులు చూడాలన్నారు. అనంతరం అతిథులకు రాజ్యాంగ ప్రవేశికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కుతుంబాక శ్రీనివాస్, ప్రవీణ్, జయదాస్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు గణేష్, సురేష్, బాలస్వామి, భాస్కర్, రమా తదితరులు పాల్గొన్నారు.

'భట్టి' సభకు స్థలాల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సభ వచ్చే నెలలో జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు స్థలాలను పరిశీలించారు. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ తదితర అగ్రనేతలు హాజరవుతున్న క్రమంలో నగరంలోని ఎస్అండ్ బీజీఎస్ఆర్ కళాశాల గ్రౌండ్, నూతన కలెక్టరేట్ సమీపంలో, వైఎస్సార్ కాలనీ సమీపంలోని స్థలాలను మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్, పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నగర అధ్యక్షులు మహ్మద్ జావీద్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యడ్లపల్లి సంతోష్, దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ సేవలు ప్రశంసనీయం



శిబిరంలో పాల్గొన్న వైద్యులతో డాక్టర్ పుల్లారావు

కూసుమంచి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఖమ్మం జిల్లా వారి సేవలు ప్రశంసనీయమని ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లారావు అన్నారు. ఆదివారం మండలంలోని మల్లేపల్లిలో భాగం రంగయ్య మెమోరియల్ పాలీక్లీనిక్ సౌజన్యంతో ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా హెల్త్‌క్యాంపును ఆయన ప్రారంభించారు. ఐఎంఏ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, నిష్ణాతులైన వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేయటం, తద్వారా పేదలను ఆదుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఏ అధ్యక్షుడు డాక్టర్ భాగం కిషన్‌రావు, కార్యదర్శి డాక్టర్ తేజావత్ సురేష్, డాక్టర్ బీఎస్‌రావు, వైద్యులు శశికుమార్, వేణుగోపాల్, జగదీష్, ప్రసాద్, కృష్ణప్రసాద్, తన్మయ్ తదితరులు పాల్గొని వైద్యసేవలు అందించారు.

'మెర్క్లి సోక్రటి'కి విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్‌బీఐటీ చైర్మన్ కృష్ణ, కరస్పాండెంట్ ధాత్రి

ఖమ్మం సహకారనగర్: తమ విద్యార్థి డి.సనా తబస్సుమ్ మెర్క్లి సోక్రటి కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైన నట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఆదివారం ఆన్‌లైన్ విధానంలో ప్లేస్‌మెంట్స్ నిర్వహించగా రాష్ట్రవ్యాప్తంగా 700 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 17మందిని ఎంపిక చేస్తే అందులో తమ విద్యార్థిని ఉందన్నారు. విద్యార్థిని కంపెనీకి అసోసియేట్ బిజినెస్ అనలిస్ట్‌గా ఎంపిక కాగా వార్షిక వేతనం రూ.4 లక్షలు ఉందన్నారు. ఈమేరకు విద్యార్థినిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు ఏవీవీ శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

డీవీ కృష్ణ ఆశయాలు కొనసాగిద్దాం

రఘునాథపాలెం: విప్లవోద్యమనేత ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ఆశయాలను కొనసాగిద్దామని ప్రజాపంథా జిల్లా నాయకురాలు ఆవులమంగతాయి అన్నారు. ఆదివారం మండలంలోని చింతగుర్తిలో కృష్ణ ప్రథమవర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదర్ సాహెబ్, గోపగాని ముత్తిలింగం, లింగనబోయిన రామ్మూర్తి, నాగేశ్వరరావు, విశ్వనాథం, వెంకన్న, రామయ్య, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు .

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ముదిరాజులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీసీ కులసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఆదివారం త్రీటౌన్‌లో జరిగిన సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల వెంకటనర్సయ్య, జిల్లా అధ్యక్షుడు జ్వాలా గౌడ్ మాట్లాడారు. క్షమాపణ చెప్పకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మేకల నాగేంద్ర, ఆర్‌వీఎస్ యాదవ్, మహేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కోరారు. ఆదివారం నగరంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు పూర్తయినా ఇప్పటివరకు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వలేదన్నారు. ఖమ్మంలో కూడా సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఫర్వీన్, తరుణ్, వీరేందర్, శరత్, వెంకటేష్, సతీష్, షరీఫా,రాగిణి, సుమలత, నవ్య, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



కూసుమంచి: బోనాలతో వెళ్తున్న మహిళలు..

కూసుమంచి/ నేలకొండపల్లి: వానలు పుష్కలంగా కురిసి సమృద్ధిగా పంటలు పండాలని కోరుతూ ఆదివారం గ్రామాల్లో యాదవులు గంగమ్మ జాతరను జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి గంగమ్మ ఆలయం వరకు బోనాలు, డప్పులతో వెళ్లి పూజలు నిర్వహించారు. పొట్టేళ్ల బలిచ్చి మొక్కులు చెల్లించారు. బండపై పాయసాన్ని పోసి చిన్నా,పెద్దలు ఆరగించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆట, పాటలతో నృత్యాలతో సందడి చేశారు.



నేలకొండపల్లిలో..